క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

మంథని: నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు ఆదివారం మంథనిలో జెడ్పీచైర్మన్ పుట్ట మధు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంథని మండలం గుమునూరు కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నక్క నవీన్, మంథనికి చెందిన మంథని సురేశ్, రమేశ్, ప్రదీప్, రాజు, నరేశ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే మంథని మండలం లక్కేపూర్ గ్రామానికి చెందిన ముస్లింలు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. రామగిరి మండలం ముస్త్యాలకు చెందిన మాజీ ఉపసర్పంచ్ సుందిళ్ల శంకర్, ఆవునూరి లింగమూర్తి, కాశీపేట పోశం, కాటారం మండలం చింతకాని గ్రామానికి చెందిన ముక్కెర పూర్ణచందర్, దుబాసి వెంకన్న, ముక్కెర మహేశ్, గడ్డం వెంకటేశ్ తదితరులు పార్టీలో చేరారు.

ముత్తారం మండలంలో..

ముత్తారం: మండలంలోని రామకృష్ణాపూర్(ఇప్పలపల్లి)కి చెందిన కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలువురు ఆదివారం రాత్రి పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధూకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన సుమారు 30మందిలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీపీ జక్కుల ముత్తయ్య పటేల్, సర్పంచ్ ఉప్పు సుగుణశ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు కోసం పనిచేయాలి



మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

రామగిరి: బీజేపీలో నిత్యం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం లభిస్తుందని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. సెంటినరీకాలనీలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఆయా గ్రామాల్లోని కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు బీజేపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో మంథని నియోజకవర్గంలో బీజేపీ గెలుపుకోసం సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ముల్మూరి శ్రీనివాస్, ఎడ్ల సదాశివ్, తోట్ల రాజు, తీగల శ్రీధర్, క్రాంతి, బత్తిని నర్సయ్య, యాట భూమేశ్ పాల్గొన్నారు.

అర్హులకు అందని సంక్షేమ పథకాలు



జెండా ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

పెద్దపల్లిరూరల్: ప్రత్యేక రాష్ట్రం సాధించాక తమకు మేలు జరుగుతుందని ఆశించిన పేదలకు నిరాశే మిగిలిందని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య అన్నారు. పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామంలో ఆదివారం మన ఊరు మన ఉష కార్యక్రమంలో భాగంగా జెండా ఆవిష్కరించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నాయకులు వెంకటేశ్, సవిత, స్వప్న, బాబు, గోపాల్, అనిల్, రియాజ్, అరుణ, శారద, సాగర్, కొమురయ్య పాల్గొన్నారు.

ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయులకు సన్మానం

ధర్మారం: మండల కేంద్రంలోని బ్రిలియంట్ మోడల్ స్కూల్‌లో ఆదివారం ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రిలియంట్ మోడల్‌స్కూల్ విద్యాసంస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను చైర్మన్ సిరిపురం సత్యనారాయణ, ఎస్సై సత్యనారాయణ సన్మానించారు. ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

హైదరాబాద్‌కు తరలిన పద్మశాలీలు

ఎలిగేడు/జూలపల్లి: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన పద్మశాలీ రాజకీయ శంఖారావానికి ఎలిగేడు, జూలపల్లి మండలాల నుంచి పద్మశాలీలు తరలివెళ్లారు.

అర్చకులకు వేతనం పెంపు

- జిల్లాలో ధూపదీప నైవేద్య ఆలయాలు మొత్తం 684
- ఎంపికైన ఆలయాలు 42



సుల్తానాబాద్ శివాలయంలో పూజ చేస్తున్న అర్చకులు

సుల్తానాబాద్: దేవాలయాల్లో ధూప, దీప, నైవేద్య పథకం ద్వారా ప్రతి నెలా ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.6వేలను దేవాదాయ శాఖ రూ.10వేలకు పెంచుతూ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు జీవో నంబర్ 128 జారీతో జిల్లావ్యాప్తంగా 42 మంది అర్చకులకు లబ్ధి చేకూరనుంది. గతంలో ఈ పథకం కింద ప్రభుత్వం ప్రతినెలా రూ.6వేలు చెల్లించేది. అందులో రూ.4వేలు అర్చకుల గౌరవ వేతనం మిగిలిన మొత్తం ధూప, దీప నైవేద్యం ఖర్చుల కోసం వ్యయం చేసేవారు. ప్రస్తుతం రూ.10వేలు పెంచడంతో రూ.6వేలు, అర్చకుల గౌరవ వేతనం, రూ.4వేలు ధూప, దీప నైవేద్యం కింద ఖర్చు కోసం వినియోగించాల్సి ఉంటుంది. ఈ పెంపు అర్చకులకు కొంత ఊరట కలిగించనుంది. ప్రధానంగా మారుమూల గ్రామాల్లో అనేక చిన్న ఆలయాలు అధ్వాన స్థితిలో ఉన్నాయి. అటువంటి ఆలయాలకు ఈ సాయం ఎంతో మేలు చేస్తుందని వారు పేర్కొంటున్నారు. జిల్లాలో ఆలయాలు ఉన్నాయి.

పెంపు హర్షణీయం

ధూపదీప నైవేద్యం పథకం అర్చకుల ఇబ్బందులను గుర్తించిన సీఎం గౌరవ భృతిని రూ.10వేలకు పెంచడం హర్షణీయమని జిల్లా అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు కాందూరు వాసు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రూ.2,500 ఉన్న గౌరవభృతిని రూ.10వేల వరకు పెంచారు.

వరిలో అగ్గితెగులు.. రైతన్నకు దిగులు

- ఎర్రబారుతున్న వరి
- వాతావరణంలో మార్పులతో సోకుతున్న తెగుళ్లు
- అన్నదాతలపై అదనపు భారం



అగ్గి తెగులు సోకిన వరి



పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతు

సుల్తానాబాద్: వాతావరణంలో ఆకస్మిక మార్పులతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. పంటలకు సోకుతున్న తెగుళ్లు అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. వరిపైరు నాటు వేసిన తర్వాత అగ్గి తెగులు, కాండం తొలుచు పురుగు ఉధృతమవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఆయా ప్రాంతాల్లో వర్షాభావంతో పత్తి మొక్కలు వాలిపోతున్నాయి. వరిపైరు ఎరుపు రంగులోకి మారడం, ఎదుగుదల లోపించడం, పత్తి మొక్కలు వాడిపోవడం వంటి లక్షణాలను గుర్తించి, ఇబ్బడిముబ్బడిగా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. దీంతో రైతులపై అదనపు భారం పడుతోంది.

వరిసాగుకు ప్రాధాన్యం..

మెట్టప్రాంతమైన జిల్లాలో నేలలు ఆరుతడి పంటలకు అనుకూలంగా లేకపోవడం, వానరాలు, వన్యప్రాణుల బెడద తదితర కారణాలతో ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో రైతులు ఆరుతడి పంటలను అంతంత మాత్రంగానే సాగు చేశారు. సీజన్ ప్రారంభంలో ముఖం చాటేసిన వర్షాలు ఆ తర్వాత సమృద్ధిగా కురిశాయి. సాగునీరు పుష్కలంగా ఉండడంతో ఎప్పటిలాగే వరిసాగుకు ప్రాధాన్యం ఇచ్చారు. వరిసాగు అంచనాకు మించి పెరగగా, గతేడాది వానాకాలంతో పోల్చితే ఈసారి పత్తిసాగు కొంత మేర తగ్గింది. జిల్లాలో 2,01,408 ఎకరాల్లో వరిపంట సాగవుతుందని వ్యవసాయ అధికారులు చెప్పారు. పత్తి 62,750 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణంలో వేశారు.

పొంచి ఉన్న ముప్పు

పంటలు వేసిన కొద్ది రోజుల్లోనే తెగుళ్లతో ముప్పు ఏర్పడింది. ఆదిలోనే వివిధ రకాల పురుగులు ఆశిస్తుండటంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వరిలో కాండం తొలుచు పురుగు క్రమంగా ఉధృతం అవుతోంది. చిరు పొట్ట దశలో ఉన్న చేనులో కాండం తొలుచు రెక్కల పురుగు ఆశిస్తూ గుడ్లు పెడుతోంది. గుడ్ల నుంచి పిల్లలు వచ్చి వరి ఈక దశ చేరుకోగానే మొగిని తినేస్తున్నాయి. జిల్లాలో సుల్తానాబాద్, ఓదెల, ఎలిగేడు, శ్రీరాంపూర్, జూలపల్లి, పెద్దపల్లి, కమాన్‌పూర్, మంథని పలు మండలాల్లో కాండం తొలుచు పురుగు ప్రభావం అధికంగా ఉన్నట్లు రైతులు చెప్తున్నారు. నల్లరేగడి భూముల్లో తేమ ఉండడంతో పత్తి పంటకు ఎలాంటి ఇబ్బంది లేకున్నప్పటికీ ఎర్రనేలల్లో వేసిన పత్తి చేను మొక్కలు వర్షాభావంతో వాలిపోతున్నాయి. సకాలంలో సాగు నీరు అందక తొలి దశలోనే మొక్కలు వాలిపోతే ఈ ప్రభావం పంట దిగుబడిపై పడుతుందని రైతులు వాపోతున్నారు.

పంట వేసిన పదిరోజుల్లోపే సోకింది



వరికి అగ్గి తెగులు సోకింది. పంట వేసిన పది రోజుల్లోపే సోకడంతో ఇబ్బంది పడుతున్న. పంట రక్షణకు రసాయనాలు పిచికారీ చేయడంతో అదనపు ఖర్చు మరింత భారం అవుతోంది. పిచ్చుకలు చేస్తేనే పంట తగ్గుతుందని అధికారులు చెప్తున్నారు.

– సదయ్యగౌడ్, రైతు, తొగర్రాయి

యాజమాన్య పద్ధతులు పాటించాలి



ప్రస్తుతం రైతులు పంట యాజమాన్య పద్ధతులను పాటించాలి. చిరు పొట్టదశలో ఉన్న వరిపై రెక్కల పురుగును గమనిస్తే కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ పొడి మందు 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ మందు 0.3 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

– ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు



ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్న సిబ్బంది

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లో తెల్లవారుజామున 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పిడుగుపాటుకు కాలిపోయింది. సమాచారం అందుకున్న ఏఈ శ్రీనివాస్, ఫోర్‌మెన్ మల్లేషం, లైన్ ఇన్‌స్పెక్టర్ అప్పాసి నాగరాజు, లైన్‌మెన్ పూర్ణచందర్ సిబ్బందితో కలిసి విద్యుత్ సరఫరా అందించేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏఈ సూచనలతో బిగించారు. వర్షంలో సైతం స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన అధికారులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న నాయకులు

ధర్మారం: మండలం నర్సింగపూర్ గ్రామానికి చెందిన నిరుపేద యువతి కాంపెల్లి కనుకవ్వ వివాహానికి ఎల్ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ కొప్పుల స్నేహలత రూ.10వేల నగదును ఆదివారం అందజేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండ సత్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు గొడుగు మల్లయ్య, బొజ్జ మహిపాల్, కనకట్ల సంతోష్, లక్ష్మణ్, గంగయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు

ముత్తారం: కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోవద్దని ముత్తారం ఎంపీపీ జక్కుల ముత్తయ్య పటేల్ అన్నారు. ఆదివారం ముత్తారంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మంచి సంకల్పంతో ప్రవేశపెట్టిన దళితబంధుపై కాంగ్రెస్ పార్టీ వాళ్లు దళితుల మధ్యనే చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అర్హులైన దళితులందరికీ విడతల వారీగా దళితబంధు అందుతోందన్నారు. దళితులు కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మి బీఆర్ఎస్‌కు దూరం కావొద్దని కోరారు.

✦ఎస్సైగా ఎంపికైన యువకుడికి సన్మానం

పాలకుర్తి: మండల పరిధిలోని కన్నాల గ్రామానికి చెందిన బుట్టి శేఖర్‌ను ఆదివారం గ్రామంలోని వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల విడుదలైన ఎస్సై పరీక్ష ఫలితాల్లో శేఖర్ ఎంపికయ్యాడు. ఈమేరకు గ్రామ ఎస్సీకాలనీ కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో శేఖర్‌ను సత్కరించారు. నాయకులు దేవీ లక్ష్మీనర్సయ్య, తొగరి తిరుపతి, బూర్ల మల్లేషం, శ్రీనివాస్, బుట్టి శ్రీధర్, ఇటిక్యాల లక్ష్మణ్, మడక కనుకయ్య, రాజేశ్వరి ఉన్నారు.

✦భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి పూజలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వివిధ ఆలయాల్లో ఆదివారం సంకష్ట చతుర్థి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా సంకష్ట చతుర్థి వేడుకలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఉపవాస దీక్షలతో భక్తులు వినాయకుడికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. భక్తులు చంద్రదర్శనం చేసుకుని ఉపవాస దీక్ష విరమించారు.

✦ఓదెలలో కుండపోత వర్షం

ఓదెల: మండలంలోని 22 గ్రామాల్లో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొలనూర్, గోపరపల్లె ఉప్పరపల్లె చెరువుల మత్తళ్లు దూకుతున్నాయి.

✦గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న గణేశ్‌నగర్ గణేశ్ నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా మాటేటి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కాలనీలో గణేశ్ నవరాత్రి ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. గౌరవాధ్యక్షుడు గుర్రాల శంకరయ్య, ప్రధాన కార్యదర్శి సోముల శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి నల్ల శ్రీనివాస్, ముఖ్య సలహాదారు పడాల శ్రీరాములు ఉన్నారు.

✦శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయకేతనం ఎగురవేసి కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావాలని ప్రత్యేక పూజలు చేసినట్లు ఆయన తెలిపారు.

✦జనక్‌ప్రసాద్‌కు కాంగ్రెస్ టికెట్ కేటాయించాలి

గోదావరిఖని: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్ కేటాయించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ నాయకులు ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. కార్మిక క్షేత్రంలో మంచి పట్టున్న తమ యూనియన్ నేతకు టికెట్ కేటాయిస్తే గెలిచే అవకాశం ఉంటుందన్నారు. టికెట్ కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. యూనియన్ నాయకులు ధర్మపురి, వడ్డేపల్లి దాస్, కాంపెల్లి సమ్మయ్య, బత్తుల పోషం, తేజవత్ రాంబాబు, వెంకట్‌స్వామి ఉన్నారు.

✦పద్మశాలీలకు రాజకీయ ప్రాతినిధ్యం ఇవ్వాలి

పెద్దపల్లిరూరల్: రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు పద్మశాలీలకు పోటీచేసే అవకాశాన్ని ఇవ్వాలని పద్మశాలీ సంఘ రాష్ట్ర నాయకురాలు దాసరి ఉష డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన పద్మశాలీ శంఖారావం సదస్సుకు పెద్దపల్లి నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో తరలివెళ్లారు.

డయాబెటిక్ క్యాంప్



షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని సబ్బితం గ్రామంలో ఆదివారం నిర్వహించిన క్యాంప్‌లో 57 మందికి షుగర్ పరీక్షలు చేశారు. షుగర్ నిర్ధారణ అయిన వారికి అవసరమైన సూచనలు చేశారు. సభ్యులు వూట్ల అశోక్ కుమార్, బిక్షపతి లైశెట్టి, కార్యదర్శి పిట్ట వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ కాలనీలోకి వరదనీరు



కాలనీ రోడ్లపై నిలిచిన వర్షం నీరు

రామగిరి: మండలంలోని పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని లద్నాపూర్ ఆర్అండ్ఆర్ కాలనీ వర్షంనీరుతో నిండిపోయింది. సింగరేణి నిర్వాసిత గ్రామమైన లద్నాపూర్ గ్రామస్తులకు పన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్లాట్స్ కేటాయించారు. ఏర్పాటు చేసిన లేఅవుట్స్‌లో రోడ్స్, డ్రైయినేజీ, విద్యుత్ సదుపాయం, ముఖ్యంగా లేఅవుట్ ఎండింగ్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని పలుమార్లు సంస్థ దృష్టికి తీసుకెళ్లినా సింగరేణి అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచ్ అల్లం పద్మ అన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో డ్రైనేజీ నీరు అంతా ఊళ్లోకి వస్తుందని, అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఓటరు నమోదు కేంద్రాల పర్యవేక్షణ



పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ జాహెద్ పాషా



కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ స్వర్ణ

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని కిష్టంపేట, గంగారం, పెగడపల్లి, పందిల్ల, మడిపెల్లి, మల్యాల, పెద్దరాతుపల్లి, కూనారం గ్రామాల్లో ఆదివారం వర్షంలోనూ ఓటరు నమోదు కేంద్రాలను తహసీల్దార్ జాహెద్ పాషా పర్యవేక్షించారు. అర్హులందరికీ ఓటుహక్కు కల్పించే బాధ్యత బీఎల్‌వోలపై ఉందని, ఓటరు నమోదు కార్యక్రమం పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఆర్ఐ వైశాలి, సూపరింటెండెంట్ దీరజ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఎలిగేడు: మండలంలోని గ్రామాల్లో 18ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ స్వర్ణ కోరారు. మండలంలోని 22పోలింగ్ బూత్ కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదును తహసీల్దార్ పరిశీలించారు. ఆర్ఐలు శైలజ, రజిత, బీఎల్‌వోలు ఉన్నారు.

దుర్గామాత బోనాలు



దుర్గామాత ఉత్సవంలో మక్కాన్‌సింగ్

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని 28వ డివిజన్ రెల్లి కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కనకదుర్గామాత బోనాల మహోత్సవంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ దంపతులు పాల్గొన్నారు. దుర్గామాతకు మొక్కులు చెల్లించి, బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ కార్పొరేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి యుగేందర్, నాయకులు బోండాల శ్రీనివాస్, దేవేందర్, రెల్లి కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీవోఏల వేతనాల పెంపుపై హర్షం

సుల్తానాబాద్: గ్రామీణాభివృద్ధి శాఖలో మహిళా సంఘాల అభ్యున్నతికి కృషి చేస్తున్న గ్రామ ఆర్గనైజింగ్ అసిస్టెంట్ (వీవోఏ)లకు గౌరవ వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెంచిన వేతనాలు ఈ నెల నుంచి అమల్లోకి వస్తాయని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 450 మంది వీవోఏలు

జిల్లావ్యాప్తంగా 450 గ్రామ సమాఖ్యలు ఉండగా 450 మంది వీవోఏలు పని చేస్తున్నారు. సంఘాలకు సంబంధించి పుస్తకాలు రాస్తూ సభ్యులు, అధికారులకు మధ్య వారధిగా ఉన్నారు. వారి డిమాండ్ల సాధనకు ఈ ఏడాది ఏప్రిల్‌లో సమ్మె చేపట్టారు. పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దాదాపు 36రోజుల తర్వాత ప్రభుత్వ హామీ మేరకు సమ్మె విరమించారు. ప్రస్తుతం వీవోఏకు ప్రభుత్వ వేతనంగా రూ.3,900తో పాటు ప్రభుత్వం రూ.2వేలు ఇస్తుండగా ఓన్ ప్రాఫిట్ రూ.5900 చెల్లిస్తుండేవారు. దీనికి అనుగుణంగా రూ.1,100 పెంచుతూ ఇప్పుడు రూ.5వేలు చేసింది. ప్రస్తుతం గ్రామ సమాఖ్య సంఘాల వారు వీవోఏలకు రూ.3వేలు చెల్లిస్తున్నారు. ప్రతి నెలా వీవోఏలకు రూ.8వేల వేతనం వస్తుంది.

వరుస చోరీలతో లారీ యజమానుల్లో ఆందోళన

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొద్దిరోజులుగా జరుగుతున్న వరుస చోరీలతో స్థానికంగా లారీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. దుండగులు లారీలను టార్గెట్‌గా చేసుకుని అందులోని పరికరాలను ఎత్తుకెళ్తున్నారు. కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని శాలపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన లారీని కన్నాల బస్టాండ్ సమీపంలోని ఓ పెట్రోల్ బంక్ ఆవరణలో పెట్టాడు. అయితే నాలుగురోజుల క్రితం అందులోని బ్యాటరీలు, రూ.50వేల విలువ ఇతర సామగ్రిని దుండగులు చోరీ చేశారు. ఈ ఘటనకు ముందు అందుగులపల్లి సమీపంలోని ఓ పెట్రోల్‌బంక్ వద్ద నిలిపి ఉంచిన లారీలోని డీజిల్ చోరీకి గురైంది. ఈ సంఘటన జరిగిన మరుసటి రోజే రహదారి పక్కన నిలిపి ఉంచిన మరో లారీ టైర్లు ఎత్తుకెళ్లారు. వరుసగా జరుగుతున్న చోరీలతో లారీ యజమానుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. పైగా నిత్యం వాహనాల రద్దీతో బీజీగా ఉండే ఫోర్‌లేన్ రహదారిని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లోనే ఈ దొంగతనాలు జరుగుతుండటం గమనార్హం. రహదారిపై ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడం, ఉన్న కెమెరాలు కూడా సరిగ్గా పనిచేయకపోవడంతో దుండగులు రెచ్చిపోతున్నారు. కాగా ధర్మారం క్రాస్‌రోడ్డు, బసంత్‌నగర్‌లోని రాజీవ్‌నగర్, జీడీనగర్‌కు చెందిన కొందరు యువకులు చెడు వ్యసనాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. పోలీసులు రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం చేసి చోరీలను నియంత్రించాలని, ఫోర్‌లేన్ రహదారిపై ముఖ్య కూడళ్లలో సీసీకెమెరాలను ఏర్పాటు చేయాలని లారీ యజమానులు, స్థానికులు కోరుతున్నారు.

వంటసామగ్రి అందజేత



వంటసామగ్రి అందజేస్తున్న సర్పంచ్ జగన్

పాలకుర్తి: మండల కేంద్రంలోని హన్‌మాన్ మాల ధారణ స్వాములకు ఆదివారం సర్పంచ్ దుర్గం జగన్ వంటసామగ్రి అందజేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఏటా దాదాపు 100 మంది భక్తులు హన్‌మాన్ మాలధారణ ధరిస్తారు. దీనిలో భాగంగా వారికి వంట చేసుకునేందుకు కావాల్సిన సామగ్రి అందజేయాలని సర్పంచ్ జగన్‌ను కోరగా స్పందించిన జగన్ దాదాపు రూ.20వేల విలువ గల వంటసామగ్రి అందజేశారు.

గడువు ముగిసిన పాల ప్యాకెట్ల విక్రయం

ముత్తారం: మండల కేంద్రంలోని కొన్ని స్వీట్ షాపుల నిర్వాహకులు గడువు ముగిసిన పాల ప్యాకెట్లు విక్రయిస్తున్నారు. శనివారం రాత్రి ఓ బేకరి షాపులో స్థానికులు పాల ప్యాకెట్ కొనుగోలు చేయగా.. గడువు ముగిసినట్లు గుర్తించాడు. ఇదేంటని ప్రశ్నిస్తే నిర్వాహకుడే దబాయించే ప్రయత్నం చేసినట్లు స్థానికులు తెలిపారు. సంబంధితశాఖ అధికారులు షాపులను తనిఖీ చేసి గడువు ముగిసిన పదార్థాలు విక్రయిస్తున్న షాపులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయంలో శ్రావణ ఆదివారం సందడి

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి గ్రామంలోని శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానంలో అల్లంకి భూమయ్య-సుశీల జ్ఞాపకార్థం వారి కుమారులు అల్లంకి ఆనందం, సత్యనారాయణ నిర్మించిన ఫంక్షన్‌హాల్‌లో వారి కుటుంబసభ్యులతో ఆదివారం శ్రావణ ఆదివారం సందడిగా మారింది. కార్యక్రమంలో సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వ, ఆలయ కమిటీ సభ్యులు సామ రాజేశ్వర్‌రెడ్డి, పెద్ది రాజేశం, ఏలేటి మల్లారెడ్డి, గడ్డం శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి కిషన్‌రెడ్డి, బద్దం మల్లారెడ్డి, గుర్రం మల్లారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీకి చెందిన బాణాల నాగమణి-తిరుపతి దంపతుల కుమార్తె లత వివాహానికి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆదేశాల మేరకు కార్పొరేటర్ ఎన్వీ రమణారెడ్డి చేతుల మీదుగా పుస్తెమెట్టెలు అందించారు. కోఆర్డినేటర్ ఎడెల్లి శ్యామ్, యూత్ నాయకులు అవినాష్ పాల్గొన్నారు.